సాక్షి
చిత్తూరు

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



పవిత్రోత్సవాలు ప్రారంభం
అప్పలాయగుంటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో



పంట పొలాలపై ఏనుగుల దాడి
కల్లూరు, జూపల్లె, పాలెం గ్రామాలలో ఏనుగుల గుంపు పంట పొలాలను ధ్వంసం చేశాయి. - 8లో



ఆర్టీసీ బస్సు.. సీఎన్‌జీగా మార్పు!
ఆర్టీసీ డీజిల్ ఇంజిన్‌ను సీఎన్‌జీగా చిత్తూరు డిపోలో మార్పుకు శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా నడిపారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రపంచంలోనే మొదటి వాస్తుశిల్పి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : విశ్వకర్మను ప్రపంచంలోనే మొదటి వాస్తు శిల్పిగా భావిస్తారని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. విశ్వకర్మ కృష్ణుడు పరిపాలించిన పవిత్రమైన ద్వారకా నగరాన్ని పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజ భవనాన్ని నిర్మించారన్నారు. ప్రజా ప్రయోజనకరంగా వాస్తు ప్రకారం పట్టణాలు, భవనాల నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు విశ్వకర్మ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, నగర మేయర్ అముద, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర జేడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిభాషా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంలో పాత బస్టాండు !



కన్సల్టెన్సీ ప్రతినిధితో సమీక్షిస్తున్న మేయర్, ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్ : చిత్తూరు పాత బస్టాండు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇక్కడున్న ఖాళీ స్థలాన్ని పీపీపీ విధానంలో ఇంటిగ్రేడ్ బస్టాండుగా నిర్మించడానికి బుధవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మేయర్ అముద, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, కమిషనర్ నరసింహ ప్రసాద్ కలిసి.. ఓ ప్రైవేటు కన్సల్టెంట్ ప్రతినిధితో సమీక్షించారు. ఇప్పటికే పీపీపీ విధానంలో బస్టాండును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయని, త్వరలోనే ఆమోదం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోమారు బస్టాండు అంశం తెరపైకి రావడం, ఏం జరుగుతుందోనని వ్యాపారులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

క్విజ్ పోటీలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విద్యార్థులు వికసిత్ భారత్ క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ అన్నారు. నగరంలోని ఆ కార్యాలయంలో వికాస్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని 15 రోజుల పాటు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాంతీయ గణాంక అధికారి బాబురెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యార్థులు మై భారత్ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మై భారత్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ఆ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సపోర్ట్ అధ్యక్షులు జోసెఫ్ రాజ్, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు

శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించండి



నరోత్తమరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్‌లకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరోత్తమరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ పోస్టింగ్స్ ఇవ్వక ముందే హైస్కూల్ ప్లస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను ఉద్యోగోన్నతి కల్పించి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ అనంతరం డీఎస్సీ అభ్యర్థుల పోస్టింగ్స్ ఇవ్వాలన్నారు. దసరా సెలవులు ఈనెల 21వతేదీ నుంచి ప్రకటించాలన్నారు. కరువు భత్యం వెంటనే విడుదల చేసి ఇంటీరియం రిలీఫ్‌ను దసరా కానుకగా ఇవ్వాలని కోరారు.

అనారోగ్యశ్రీ

కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ఎన్‌టీఆర్ వైద్యసేవా (ఆరోగ్యశ్రీ) పథకానికి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయి నిధులు విడుదల చేయకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. ఓపీ సేవలు సైతం డబ్బులు వెచ్చించి చూపించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే కానీ పేదలకు ఉచిత వైద్యం అందించలేమని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరోగ్యశ్రీ సేవలు పేదలకు దూరమై సేవలు భారంగా మారాయి.



- రూ.కోట్లల్లో పేరుకుపోయిన బకాయిలు
- పలు ఆస్పత్రుల్లో నిలిచిపోయిన ఓపీ సేవలు
- సర్వర్ సమస్య అంటూ దాటవేస్తున్న వైనం
- బకాయిల చెల్లింపుపై ముఖం చాటేసిన ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న పేదలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కూటమి పాలనలో ఆర్యోగ సేవలు ఆమడదూరంలో నిలిచాయి. ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది. ఆరోగ్యశ్రీకి బకాయిల బెడద పట్టుకుంది. రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలతో ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభావం చూపుతోంది. సేవలు దారి తప్పుతున్నాయి. పలు నెట్‌వర్క్ ఆస్పత్రులు సర్వర్‌ను బూచిగా చూపుతూ సేవలను నిలిపివేస్తున్నాయి. బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వహణ కష్టతరంగా మారిందని కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలకు స్వస్తి పలుకుతున్నాయి. పేదల ఇంట ఆరోగ్య దీపం వెలిగించే పథకం అంధకారం దిశగా అడుగులు వేస్తోంది.

మోయలేని భారం

ఎన్టీఆర్ వైద్య సేవా పరిధిలో జిల్లా వ్యాప్తంగా పలు నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. అందులో ప్రైవేట్ కార్పొరేట్ (నెట్‌వర్క్) ఆసుపత్రులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు కూడా ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు వంద పడకలు, 50 పడకలు గల ఆసుపత్రులు ఉన్నాయి. ఒక రోజుకు వేల మంది నిరుపేద రోగులు ఉచిత వైద్యం కోసం నెట్‌వర్క్ ఆసుపత్రులకు వస్తుంటారు. వారికి వైద్య సేవలు అందించాలంటే ఆసుపత్రుల యాజమాన్యానికి ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ ఆసుపత్రులకు ప్రభుత్వం రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక నెలకే ఒక ఆసుపత్రికి రూ.లక్షల్లో ఖర్చు ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బకాయిలను సక్రమంగా చెల్లించలేదు. విడుదల చేసిన నిధుల కన్నా.. ఆసుపత్రుల్లో అందించిన వైద్య సేవలు, అందాల్సిన బిల్లులు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వ రంగానికి చెందిన ఆసుపత్రుల్లో 'వైద్య ' 'సేవా' పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ డెలివరీలు, పెద్దాసుపత్రుల్లో సాధారణ డెలివరీలతో పాటు సర్జరీలు, అలాగే గర్భాశయం తదితర వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య సేవలు అందిస్తారు. ఇందుకు గాను ఒక్కో వ్యాధిని బట్టి వైద్య సేవా ట్రస్ట్ నుంచి బిల్లులు మంజూరవుతాయి. ఆ విధంగా వచ్చిన డబ్బును ప్రోత్సాహకం కింద వైద్యులకు 45 శాతం, ఆసుపత్రుల అభివృద్ధికి 55 శాతం కేటాయిస్తారు. అయితే అధిక సంఖ్యలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారానే దాదాపుగా 35 రకాలకు పైగా వ్యాధులకు ఉచిత వైద్య సేవలు లభించడంతో ఈ ఆసుపత్రులపైనే భారం పడనుంది.

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నిలిచిన సేవలు

ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కుంటుపడుతోంది. బిల్లులు చెల్లింపులు జాప్యం చేస్తోంది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. దీంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలపై ముఖం చాటేస్తున్నాయి. జిల్లాలో పలు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత ఓపీ సేవలను మంగళవారం నుంచి నిలిపేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రి ఆరోగ్యశ్రీకి నోటీసులు ఇచ్చి సేవలకు స్వస్తి పలికాయి. బకాయిల భారంతో ఓపీ సేవలు చూడలేమని చేతులెత్తేసింది. అలాగే మరో ఆస్పత్రి సర్వర్‌ను సాకుగా చూపిస్తూ సేవలను నిలిపివేసింది. మరికొన్ని ఆస్పత్రులు మొక్కుబడిగా సేవలు అందిస్తోంది. ఇంకొన్ని ఆస్పత్రులు ఓపీ వదిలి కేవలం అత్యవసర కేసులను మాత్రం తీసుకుంటున్నాయి. చాలా వరకు సీఎం సొంత జిల్లా కావడంతో ఇబ్బందులుంటాయని సేవలను కొనసాగిస్తున్నాయి. ఈ కారణంగా ఉచిత వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన పేదలు రూ.300 పైగా డాక్టరుకు ఫీజు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా అయితే ఉచిత వైద్యం అందించే వారికి ఓపీ సేవలు ఉచితంతోనే ప్రారంభం అవుతాయి. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు గత్యంతరం లేక ఓపీ సేవలు నిలుపుదల చేశారు. ఈ నిర్ణయం ఎన్ని రోజులు ఉంటుందో తెలియడంలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో బలోపేతం

2007–2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టారు. తద్వారా లక్షలాది మంది ఉచిత వైద్యం ద్వారా పునర్జన్మ పొందారు. అనంతరం వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని మరింత బలోపేతం చేశారు. 1000 లోపు ఉన్న వ్యాధుల సంఖ్యను 3,255కు చేర్చారు. అయితే టీడీపీ ప్రభుత్వం ఎప్పుడొచ్చినా 'ఆరోగ్య శ్రీ' పథకం ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలల కాలంలోనే 4వసారి ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్య సేవలను నిలుపుదల చేశాయి. దీంతో ఎన్టీఆర్ వైద్య సేవ' వెంటిలేటర్‌పై ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా బకాయిల భారంతో ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ఓపీ సేవలను నిలుపుదలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు జిల్లాలో పలు ఆస్పత్రులు సేవలను నిలిపివేశాయి.

ఆరోగ్య శ్రీనెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు

మొత్తం నెట్‌వర్క్ ఆస్పత్రులు 74	ప్రభుత్వ ఆస్పత్రులు 04
పీహెచ్‌సీలు 47	పీహెచ్‌సీ ఆస్పత్రులు 9
ప్రైవేటు నెట్‌వర్క్ 7	డెంటల్ క్లినిక్ 7

నెల	సర్జరీల సంఖ్య	వ్యయం (రూ.కోట్లల్లో సుమారు)
జనవరి	10,328	19.18
ఫిబ్రవరి	10,364	19.19
మార్చి	11,293	20.69
ఏప్రిల్	11,846	21.76
మే	12,003	22.65
జూన్	11,642	23.34
జూలై	13,187	23.34
ఆగస్టు	11,601	21.95

బోయకొండ.. పుష్ప శోభితం

- రూ.3 లక్షల విలువ చేసే పూలతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయానికి నూతన శోభ నెలకొంది. బుధవారం బెంగళూరు దేవనహళ్లి లక్ష్మీ ఫ్లవర్ డెకరేషన్స్ నిర్వాహకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. రంగు రంగు పూలతో పాటు పూల సువాసనలు కొత్త దనంతో ఆలయం భక్తులను ఆకట్టుకొంది. 17 సంవత్సరాలుగా ఏటా క్రమం తప్పకుండా దసరా మహోత్సవాలకు ముందు వారం వీరు ఆలయాన్ని బెంగళూరు నుంచి పూలను తీసుకొచ్చి వారే స్వయంగా పూలతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా జరుగుతోంది. ఆలయం లోపలే కాకుండా ఆలయం ముందు భాగం పరిసరాల్లో పూలతో అలంకరించడంతో నూతన శోభ సంతరించుకొంది. తరువాత ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వీరిని ఆలయ ఈఓ ఏకాంబరం సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



అమ్మవారి ఆలయంలో పుష్పాలంకరణ

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

- ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరసన

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా జేఏసీ నేతలు మురళీకృష్ణ, యజ్ఞేశ్వరరావు, వివేకానందరెడ్డి, చంద్రమౌళి తెలిపారు. బుధవారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణను ప్రకటించామన్నారు. ప్రధాన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయినందున ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగదు రహిత వైద్యం అందించాలని, 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్–2లను, జేఎల్‌ఎంలుగా పరిగణించి వేతనాలు ప్రయోజనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను మంజూరు చేయాలన్నారు. ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన సబ్ ఇంజినీర్లకు, ఏఈలుగా పదోన్నతిలో అవకాశం కల్పించాలన్నారు. అర్హులైన ఓఅండ్‌ఎం ఉద్యోగులను జూనియర్ సహాయకులు, సబ్ ఇంజినీర్‌గా ఖాళీలలో నియమించాలన్నారు. గురువారం సైతం నిరసన వ్యక్తం చేసి, 19, 20న రిలే దీక్షలు, 22న ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు విన్నపం సమర్పించనున్నామని వివరించారు.

సీఈగా సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్ : ట్రాన్స్‌కో చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో ముగ్గురికి పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా ఎస్‌ఈ సురేంద్రనాయుడును ఓఅండ్‌ఎం విభాగం సీఈగా, చిత్తూరు జిల్లా టెక్నికల్ ఈఈ జగదీష్‌కు, తిరుపతి నగర ఈఈ చంద్రశేఖర్‌కు ఎస్‌ఈలుగా పదోన్నతి కల్పించారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రెండవ విడత గిరిజన గృహ స్థలాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే గిరిజన గృహ స్థలాల సర్వేకు పకడ్బందీగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులైన గిరిజనులకు చేరువ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గిరిజన స్థలాల్లో గృహ సర్వే మొదటి విడతలో 10 మండలాల్లో నిర్వహించినట్లు తెలిపారు. రెండవ విడత సర్వేలో పలు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీ, ఉపాధి నిధుల నుంచి గిరిజన కాలనీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులు సమయానికి చేరుకోవాలి

- డీఎస్సీ అభ్యర్థులకు డీఈఓ సూచన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు ఎంపిక చేసిన కేంద్రం వద్దకు సమయానికి చేరుకోవాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులందరూ నేడు ఉదయం 7 గంటలకు తిరుపతి చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. ఈనెల 19న విజయవాడలో నిర్వహించే మెగా డీఎస్సీ నియామక పత్రాల కార్యక్రమానికి తిరుపతి నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని డీఈవో వెల్లడించారు.

ఒంటరి ఏనుగు దాడిపై విచారణ

పలమనేరు : ఇటీవల ఒంటరి ఏనుగు పలమనేరులోకి వచ్చి హల్‌చల్‌చేసి స్థానిక ఎఫ్‌ఆర్వో సుకుమార్‌తో పాటు ఎలిఫెంట్ ట్రాకర్ హరిపై దాడి చేసిన సంఘటనపై డీసీసీఎఫ్ చైతన్యకుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. బుధవారం పట్టణ సమీపంలోని పాతకీలపట్లరోడ్డులో సుకుమార్‌ను ఏనుగు దాడి చేసిన స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. సంఘటన జరిగినప్పుడు ఏనుగు ఎక్కడ ఉంది, ఏ వైపు నుంచి వచ్చిందని ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొసలిమడుగు వద్ద ఉన్న కుంకీ ఎలిఫెంట్ క్యాంపునకు వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించారు. కుంకీలతో ఏనుగులను ఎలా మళ్లిస్తున్నారు, ఇక్కడ ఏనుగుల దాడులు ఎందుకు తగ్గలేదని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏనుగుల కారణంగా ఒక్క ప్రాణం కూడా పోరాదనే తలంపుతో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కుంకీలను తెప్పించారన్నారు. అయితే అనుకున్న మేర ఫలితాలు రావాల్సి ఉందన్నారు. దీనిపై మరింత మెరుగ్గా చేయాలని అనుకుంటున్నామన్నారు. ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడి తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెక్షన్ ఆఫీసర్ సుకుమార్‌ను ఆయన పరామర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, ఎఫ్‌ఆర్వో నారాయణ, సిబ్బంది ఉన్నారు.



ఎఫ్ఎస్వోపై ఏనుగు దాడి చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీసీఎఫ్

ప్రక్షాళన జరిగేనా?

- ప్రజల్లో ఖాకీలపై నమ్మకం కల్పించేనా?
- ఎస్పీకి ఫీడ్‌బ్యాక్ ఇవ్వడంలో స్పెషల్ బ్రాంచ్ విఫలం
- వీధి వీధిలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- మితిమీరిన రాజకీయ జోక్యం అరికట్టేనా!
- చిత్తూరు నూతన ఎస్పీ ఎదుట పలు సవాళ్లు

చిత్తూరు అర్బన్ : ఇంట గెలిచి, రచ్చ గెలవాలన్నది పెద్దల మాట. పోలీసుశాఖపై ప్రజల్లో నమ్మకం కల్పించి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు బాటలు వేస్తామని చిత్తూరు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తుషార్ డూడీ.. ఇటీవల చాలా స్పష్టంగా చెప్పారు. ఖాకీలపై ప్రజల్లో నమ్మకం రావాలంటే ముందుగా సొంత శాఖను ప్రక్షాళన చేయడానికి పూనుకోవాల్సిందే. ఆపై ఒకరు చెప్పకున్నా సమాజంలో పోలీసులపై ప్రజలకు కచ్చితంగా నమ్మకం కలుగుతుంది.

తొలి అడుగు ఎస్‌బీ నుంచే చేపట్టాలి!

జిల్లా పోలీసుశాఖ ఎస్పీ పర్యవేక్షణలో పనిచేస్తుంది. ఎస్పీ తరువాత పోలీసుల పనితీరు, సమాజంలో జరుగుతున్న పరిస్థితిని తెలుసుకోవాల్సింది స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) విభాగం. ఎస్పీ తరువాత ఏ ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి..? పోలీస్ స్టేషన్‌లో అవినీతి విచ్చలవిడిగా ఉందా..? ఎస్‌హెచ్‌వోలు ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా? గంజాయి ఎవరు సరఫరా చేస్తున్నారు? లాటరీ టికెట్ల కింగ్‌పిన్ ఎవరు? పోలీసు వెల్ఫేర్‌కు ఏం చేయాలి? వయసు మళ్లిన తల్లిదండ్రులకు చూసుకోవాడానికి కానిస్టేబుల్‌కు ఏ స్టేషన్‌కు డీవో వేస్తే బాగుంటుంది? స్టేషన్లలో వసూల్ రాజాలు ఎవరు? ఇలా చాలా విషయాలను తెలుసుకుని ఎస్పీకు ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ ఇవ్వాల్సిన బాధ్యత ఎస్‌బీ విభాగంపై ఉంది. కానీ కొన్ని నెలలుగా ఎస్‌బీ నిస్తేజమైపోయింది. కొన్ని విషయాలు తెలిసినా ఎస్పీ వద్దకు వెళ్లి చెప్పే ధైర్యం చేయలేకపోవడం. మరికొన్ని వాస్తవాలు చెబితే ఎస్పీ ఏమనుకుంటారో అనే అనుమానం. పైగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎస్‌బీలో చాలా వరకు ఒకే సామాజిక వర్గం ఉండటం, వాళ్లకు అధికారపార్టీ నేతలతో సన్నిహిత సంబంధాల కారణంగా వాస్తవాలు ఏమాత్రం ఎస్పీకు తెలియడంలేదు. ఎవరేమనుకున్నా తనకు జరుగుతున్న నిజాలు ఎప్పటికప్పుడు తెలియాలనుకుంటే మాత్రం ఎస్‌బీ నుంచే ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరం ఉంది.



చిత్తూరులోని పోలీసు ఏఆర్ కార్యాలయం



చిత్తూరు నూతన ఎస్పీ డూడీ

చక్కదిద్దాల్సినవి ఇలా..

- ఒడిస్సా, విశాఖ నుంచి పూతలపట్టు, పలమనేరు, చిత్తూరు, కుప్పానికి దిగుమతవుతున్న గంజాయి వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతోంది. దుకాణాల్లో సిగరెట్లు దొరికినంత సులువుగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి.
- నిషేధిత లాటరీ టికెట్లు చిత్తూరు కేంద్రంగా జరుగుతూ.. పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, శ్రీకాళహస్తి, తిరుపతి మీదుగా విజయవాడ వరకు ఎగుమతి అవుతున్నాయి.
- మాదకద్రవ్యాల నివారణ కోసం ఏర్పాటైన 'ఈగల్' పేరుకు గంభీరంగా ఉన్నా, ఎగరలేని పరిస్థితి. ఇటీవల ఇందులోని ఓ ఖాకీ ఏకంగా బ్యాంకు ఉద్యోగిని బెదిరించి సస్పెండ్‌కు గురవడం చర్చనీయాంశమయ్యింది.
- చిత్తూరుతో పాటు నగరి, గంగాధర నెల్లూరు, పూతలపట్టు, యాదమరి, పలమనేరు ప్రాంతాల్లో పేకాట క్లబ్బులు నిర్వహిస్తూ నెలకు రూ.కోట్లు చేతులు మారుతున్నాయి.
- చీకటి పడితే చిత్తూరు గాంధీ విగ్రహం సాక్ష్యంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా అక్రమ గ్రానైట్ దిమ్మెల స్మగ్లింగ్, అధికార పార్టీ నాయకుల సివిల్ సెటిల్ మెంట్లు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. మరి కొత్త ఎస్పీ డూడీ.. ఈ సమస్యలను అధిగమించి, శాంతి భద్రతల పర్యవేక్షణలో సఫలీకృతులవుతారని ప్రజలు ఆశిస్తున్నారు.

పారదర్శకతకు పెద్దపీట వేయాలి

ఇప్పుడంతా స్మార్ట్ కాలం నడుస్తోంది. ఓ కానిస్టేబుల్ రూ.వంద తీసుకుంటే అప్పటికప్పుడే సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, వార్తలు వైరల్ అయిపోతున్నాయి. ఇదే సమయంలో సంబంధిత కానిస్టేబుల్‌పై ఏం చర్యలు తీసుకున్నారని సామాన్యులే హ్యాష్‌ట్యాగ్‌లు పెట్టి ప్రశ్నిస్తున్నారు. అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తే, విచారణకు ఆదేశించి వాటిని మూలన పడేయకుండా ఆరోపణలు నిజమా, కాదా అని చెప్పడంతో పాటు ఏం చర్యలు తీసుకున్నారో ప్రజలు కూడా తెలుసుకోవాలనుకుంటున్నారు. పోలీసుశాఖలో దేశ భద్రత అంశాలు తప్ప.. అధికారులు పారదర్శకత పాటిస్తే ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం పెరుగుతుంది. ఇదే సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే నిందితులను కాపాడటానికి రాజకీయ నాయకుల సిఫార్సును పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో పోలీసుశాఖ ఉదాసీనతగా ఉంటే.. తప్పు చేసిన వాళ్లు తమ ఎమ్మెల్యేలు అయినా వదలొద్దని స్వయానా సీఎం చెబుతున్న మాటలు నీటిమూటలైపోతాయనే విషయం గుర్తించుకోవాలి.

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రభుత్వం తప్పులను, ప్రజా సమస్యలను ఎత్తిచూపి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రికలపై అక్రమ కేసులు బనాయించడం తగదు. పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. సాక్షి పత్రికతో పాటు , టీవీ ఛానళ్ల, విలేకరులపై అక్రమ కేసులును తక్షణం వెనక్కి తీసుకోవాలి. కక్ష సాధింపు చర్యలను విడనాడాలి. అవసరమైతే ప్రచురించిన వార్తలో వాస్తవం లేకపోతే ఖండించాలి తప్ప ఇలా అక్రమ కేసులు బనాయించడం సరికాదు.

– వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి



ప్రభుత్వాన్ని విమర్శించడం నేరం కాదు



రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛలో భాగమే పత్రికా స్వేచ్ఛ. అలాంటి పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించటం అంటే రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. 'జర్నలిస్ట్ ల పై క్రిమినల్ కేసులు పెట్టడం మానుకోవాలి. భావప్రకటన స్వేచ్ఛ కు విఘాతం కలిగించ రాదు.' అని సుప్రీం కోర్టు ప్రభుత్వాలను ఇటీవల హెచ్చరించింది. 'ప్రభుత్వాన్ని విమర్శించడం నేరం కాదని కూడా సుప్రీం కోర్టు మరొక కేసులో స్పష్టం చేసింది. సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డిపై పెట్టిన కేసులను కూటమి ప్రభుత్వం ఉప సంహరించుకోవాలి.

– రాఘవ శర్మ, సీనియర్ జర్నలిస్ట్, తిరుపతి

క్లుప్తంగా

శ్రీగంధం చెట్లు నరికివేత

- రూ.2 లక్షలు విలువ చేసే కలప చోరీ



ఎస్.అగ్రహారం వద్ద శ్రీగంధం చెట్లను అపహరించిన దృశ్యం

చౌడేపల్లె : రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో పెంచిన శ్రీగంధం చెట్లను రంపంతో కోసి అపహరించుకెళ్లిన ఘటన ఏ కొత్తకోట పంచాయతీ ఎస్ అగ్రహారంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ అగ్రహారం కు చెందిన ఆర్.మునీంద్రకు పెద్ద గుట్ట సమీపంలో వ్యవసాయ భూమిలో కొన్నేళ్లుగా శ్రీగంధం చెట్లను పెంచుతున్నాడు. మంగళవారం రాత్రి భారీ వర్షం కురుస్తుండడంతో ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు పొలంవద్ద పెంచిన శ్రీగంధం చెట్లను కోసి విలువైన కలపను అపహరించారు. పొలం వద్దకెళ్లిన రైతు గుర్తించి లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. కలప విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, కలపతో పాటు చెట్టు వేర్లతో సహా కోసి తీసుకెళ్లారని వాపోయాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతు పేర్కొన్నారు.

రేపు చలో మెడికల్ కాలేజ్



హేమంత్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ 19న శుక్రవారం 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆందోళనలో భాగంగా మదనపల్లెలోని నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నిజానిజాలను ప్రజలకు వివరించే కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పార్టీ యువత, విద్యార్థి విభాగం నాయకులు కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల ముందు అమలు కానీ వాగ్దానాలు చేయడం అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికి వదిలేయడం చంద్రబాబుకు పరిపాటి అనిఎద్దేవా చేశారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పులిచెర్ల (కల్లూరు) : మండలంలోని కల్లూరు, పాళెం, జూపల్లె గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి నాశనం చేశాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పది రోజులుగా ఏనుగులు ఈ చుట్టు ప్రాంతాల్లోనే సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. కల్లూరుకు చెందిన పీరూసాహెబ్, సాజహాన్, ఇక్బాల్ , రామచంద్రకు చెందిన మామిడి తోటల్లో కొమ్మలను విరిచేశాయి. అలాగే జూపల్లెకు చెందిన నరసింహులు, సైద్ బాషాకు చెందిన వరి పంటను తొక్కి ధ్వంసం చేశాయి.

కృత్రిమ కాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా కృత్రిమ కాళ్లు పొందేందుకు అర్హత ఉన్న దివ్యాంగులు పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లు అందజేయడం జరుగుతుందన్నారు. కావాల్సిన వారు 99892 06667, 90000 10390 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



తిరుచ్చిపై అమ్మవార్లతో శ్రీవారు



పవిత్ర ప్రతిష్ఠ నిర్వహిస్తున్న వేద పండితులు

వడమాలపేట (పుత్తూరు) : అప్పలాయగుంటలోని టీటీడీ అనుబంధ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల సేవ, అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. పద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. తదుపరి యాగశాలలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో రెండవ రోజైన గురువారం ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. 11.30 గంటల నుంచి 12.30 మధ్య స్వామి, అమ్మవార్లకు పవిత్రాలు సమర్పిస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



తేజేస్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నగరి : జాతీయ స్థాయి జూనియర్ బాల్ బాడ్మింటన్ పోటీలకు నగరి పట్టణ పరిధిలోని సాయివివేకానంద కళాశాలలో ఇంటర్ చదువుతున్న కేసీ తేజేస్ ఎంపికయ్యాడు. అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలలో నిర్వహించిన అంతర్ జిల్లాల జూనియర్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లా నుంచి పాల్గొన్న తేజేష్ ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపిక కావడంతో పాటు స్టార్ ఆఫ్ ఆంధ్ర ధ్రువీకరణ పత్రాన్ని పొందాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తేజేష్‌ను బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

అధైర్యపడొద్దు.. అండగా నిలుస్తాం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాజీ ముఖ్యమంత్రిని కలిసేందుకు తాడేపల్లికి వెళ్లిన జీడీ నెల్లూరు మండల నేతలు

కార్వేటినగరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరంలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీ నెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మితో పాటు బంగారు పాళ్యం పర్యటనలో అక్రమ కేసులో జైలుకు వెళ్లిన కార్యకర్తలు వినోద్‌కుమార్, మోహన్, టీడీపీ నాయకులు నరికి వేసిన మామిడి చెట్ల బాధితులు శంకర్‌రెడ్డి కలిశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో జీడీనెల్లూరు మండల కన్వీనర్ వెంకటరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, బలరామరెడ్డి, హరిబాబు, వెంకటేష్‌రెడ్డి, ఏకాంబరం, డిల్లిబాబు, రూపచంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి ,గౌతం, త్యాగరాజులురెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ బస్సు.. సీఎన్‌జీగా మార్పు!

- చిత్తూరు డిపోలో ఫలించిన ప్రయోగం
- రాష్ట్రంలోనే తొలిసారి
- చిత్తూరు-వేలూరు మార్గంలో నడుస్తున్న బస్సు
- పొల్యూషన్ తక్కువ, ఆదా ఎక్కువ అంటున్న ఆర్టీసీ అధికారులు



సీఎన్‌జీగా మార్పు చేసిన బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఆర్టీసీ ఆదాలో పడింది. నష్టాలను అధిగమించేందుకు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో సరికొత్త మార్పునకు శ్రీకారం చుట్టింది. డీజిల్ బండిని సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్)గా మార్చేందుకు పూనుకుంది. థింక్ గ్యాస్‌తో ఒప్పందం కుదుర్చుంది. రాష్ట్రంలోనే తొలిసారిగా చేపట్టిన ఈ ప్రయోగం ఫలించింది. బుధవారం ఆ మార్పు చేసిన బస్సును ఆర్టీసీ అధికారులు రోడ్డుపైకి తీసుకొచ్చారు. చిత్తూరు-వేలూరు మార్గంలో తిప్పుతున్నారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం ఆదాతో పాటు బండి పొల్యూషన్‌ను నియంత్రవచ్చునని ఆర్టీసీ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఆర్టీసీ, థింక్ గ్యాస్ ఒప్పందం మేరకు సీఎన్‌జీ మార్పునకు చిత్తూరు టూ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సును ఎంపిక చేశారు. చిత్తూరు-వేలూరు మార్గంలో తిరిగే ఈ బస్సును రెండు నెలల క్రితం మార్పునకు తరలించారు. చిత్తూరు నగరం అనుపల్లిలోని సీఎన్‌జీ ఫిలింగ్ స్టేషన్‌కు పంపించారు. అక్కడ రెండు నెలలుగా శ్రమించి డీజిల్ బస్సును సీఎన్‌జీ బస్సుగా మార్పు చేశారు. రాష్ట్రంలోనే డీజిల్ బస్సును సీఎన్‌జీలోకి మార్చడం ఇదే తొలిసారి అని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఆదా ఇలా...

ప్రస్తుతం ఆర్టీసీకి కంపెనీ డీజిల్ లీటర్ రూ.96కు ఇస్తోంది. అదే సీఎన్‌జీ రూ. 84కు లభిస్తోంది. డీజల్ నుంచి సీఎన్‌జీకి మార్పు చేయడం వల్ల ఆర్టీసీ లీటర్‌పై రూ.12 దాకా ఆదా కానుంది. కేఎంపీఎల్ 5.4 నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఒక్క సిలిండర్ (11 కేజీలు) 58 కి.మీ ప్రయాణం చేయవచ్చునని వివరిస్తున్నారు.

ప్రారంభోత్సవం

చిత్తూరు టూ డిపో గ్యారేజీలో బుధవారం సీఎన్‌జీ బస్సును ప్రారంభించారు. డీపీటీఓ రాము జెండా ఊపి బస్సును ప్రారంభించి..చిత్తూరు-వేలూరు మార్గంలో నడిపారు. వేలూరు వరకు ట్రయల్ చూశారు. కేఎంపీఎల్, స్పీడ్, శబ్దం తదితర వాటిని పరిశీలించారు. ఈ బస్సు విజయవంతంగా నడిస్తే మరిన్ని బస్సుల మార్పుకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

ఏం మార్చారంటే..



సిలిండర్లు అమర్చిన దృశ్యం

డీజల్‌తో నడిచే బస్సుల్లో ఇంజిన్ ఫిస్టల్ అనే పరికరం ఉంటుంది. వాటి స్థానంలో స్పార్క్ ఫిస్టల్‌ను అమర్చారు. అలాగే సిలిండర్ ను బిగించారు. 8 సిలిండర్లు ఫిట్ చేశారు. ఒక్కో సిలిండర్ 11 కేజీల బరువు ఉంటుంది. కాగా ఈ మార్పునకు సుమారు రూ.1.50 లక్షలు వ్యయం అవుతోంది. అయితే సంస్థ ఒప్పందం ప్రకారం ఆర్టీసీకి రూపాయి ఖర్చు లేకుండా ఈ మార్పును చేయించారు.

గతంలో కూడా ప్రయోగం సక్సెస్

2022లో కూడా చిత్తూరు-2 డిపోకు సంబంధించిన సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సును ఎలక్ట్రికల్ బస్సుగా మార్పు చేశారు. బెంగళూరులోని వీర వాహన ఉద్యోగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మార్పును విజయవంతంగా పూర్తి చేసింది. 2 గంటల ఛార్జింగ్‌తో 200 కి.మీ మేర ప్రయాణం చేసేలా మార్పు చేసింది. ఈ బస్సు ప్రయోగం పూర్తవ్వగానే తిరుపతి-తిరుమల మార్గంలో తిప్పారు.

అదృశ్యమైన మహిళ .. హత్య

విచారణలో వెలుగు చూసిన హత్యోదంతం



అస్థి పంజరంగా మారిన చెంచులక్ష్మి

పెనుమూరు (కార్వేటినగరం) : అదృశ్యమైన మహిళ అస్థి పంజరంగా ప్రత్యక్షమైన సంఘటన మండలంలోని సామిరెడ్డిపల్లి సమీపంలో బుధవారం వెలుగు చూసింది. చిత్తూరు రూరల్ ఈస్ట్ సీఐ నిత్యబాబు కథనం మేరకు వివరాలిలా.. బంగారు పాళ్యం మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన గోవిందు భార్య బుజ్జమ్మ 2023 సంవత్సరం డిసెంబర్‌లో తమ కుమార్తె ఈ.చెంచులక్ష్మి(28) అదృశ్యమైయిందని బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో తేలిన మేరకు బంగారు పాళ్యం మండలానికి చెందిన చెంచులక్ష్మి, ప్రియుడు దేవేంద్రతో కలిసి పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుదాకర్ రెడ్డి మామిడి తోటలో కాపలా ఉంటూ వచ్చారు. అయితే 2023 సంవత్సరం డిసెంబర్ నెలలో ఓ రోజు వారి ఇరువురి మధ్య డబ్బుల కోసం గొడవ రావడంతో దేవేంద్ర తాగిన మత్తులో చెంచులక్ష్మిని మామిడి తోటకు సమీపంలో ఉన్న కుంటలోని నీటిలో ముంచి హత్య చేశాడు. చెంచులక్ష్మి తల్లి బుజ్జమ్మ తన కుమార్తె కనిపించడం లేదని బంగారు పాళ్యం పోలీసే స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మహిళ అదృశ్యం కేసు నమోదు చేశారు. అనంతరం ఆమె అదృశ్యమైనది పెనుమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కావడంతో 2024 జనవరిలో ఆ కేసును పెనుమూరు స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తన కుమార్తె అదృశ్యం వెనుక దేవేంద్ర హస్తం ఉందని చెంచులక్ష్మి తల్లి బుజ్జమ్మ అనుమానించడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు. దీంతో నిందితుడు దేవేంద్ర డబ్బులు విషయంలో గొడవలు రావడంతో చెంచులక్ష్మిని తాగిన మత్తులో మామిడి తోట పక్కనే ఉన్న కుంటలో ముంచి చంపేసినట్లు అంగీకరించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకట నరసింహులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చెంచులక్ష్మిని నీటిలో ముంచి హత్య చేసి పూడ్చిన ప్రాంతంలో అస్థి పంజరాన్ని వెలికి తీసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చిత్తూరు రూరల్ ఈస్ట్ సీఐ నిత్యబాబు తెలిపారు.

టీడీపీలో రగడ !

- తాళంబేడులో టీడీపీ నేతల మధ్య వర్గపోరు
- ఒకరిపై ఒకరు ఫిర్యాదుల పరంపర
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయతీ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలో టీడీపీ నేతల రగడ తారస్థాయికి చేరింది. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ పంచాయతీ ఆ పార్టీ మండల నేతల చేయి దాటి పోలీస్ స్టేషన్‌కు చేరింది. స్థానికుల వివరాల మేరకు...చిత్తూరు మండలంలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. రాష్ట్ర ప్రొహిబిషన్ శాఖ కమిషనర్‌కు తాళంబేడులోని ఓ టీడీపీ నాయకుడు మద్యం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు వెళ్లింది. ఈ మేరకు చిత్తూరు ప్రొహిబిషన్ అధికారులు ఆ నాయకుడి ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం దొరక్కపోవడంతో వెనుదిరిగారు. అయితే ఇదంతా పంచాయతీలోని ఇద్దరు టీడీపీ నేతలే రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని మద్యం అమ్ముతున్నట్లు ఫిర్యాదు వెళ్లిన నాయకుడు నిర్ధారణకు వచ్చాడు. మద్యం అమ్మకాలు ఆపేశాడు. దీంతో ఆ ఇద్దరు నేతలు చేస్తున్న వర్కులు, ఇతర పనులపై కన్నేశాడు. సమాచార హక్కు చట్టం కింద అంగన్‌వాడీ, షెడ్డు నిర్మాణ పనులు, ఇరిగేషన్ ద్వారా మంజూరు చేసుకున్న పనులపై వివరాలు సేకరించారు. అలాగే కలెక్టర్‌కు సైతం ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. ఈ రగడ నడుస్తున్న క్రమంలో బుధవారం మంగాపురంలోని ఓ నేత ఇంటి వద్ద విందు జరిగింది. ఈ విందులో మద్యం విక్రయం ఆపేసిన నాయకుడు విందు ఏర్పాటు చేసిన నాయకుడు వద్ద తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకొచ్చాడు. మీరు...బతకరు...నన్ను బతనివ్వరంటూ..ఆవేదనను వ్యక్తం చేశాడు. ఇంతలో మద్యంపై ఫిర్యాదు చేసిన ఓ నాయకుడి భార్య ఆగ్రహంతో అక్కడ ఊగిపోయింది. దీంతో మద్యం ఆపేసిన నాయకుడు మా ఊరికి రా చూసుకుందామని సవాల్ విసురుతాడు. ఇలా సవాల్ విసిరిన నాయకుడిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. ముందు జాగ్రత్తగా సవాల్ విసిరిన నాయకుడు ఆ ఇద్దరు నేతలు నన్ను కొట్టారంటూ ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

భార్యపై కత్తితో దాడి

- విషమంగా వివాహిత పరిస్థితి
- ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన భర్త
- పోలీసులకు పట్టించిన స్థానికులు



భర్త రాజేష్ చేతిలో గాయపడ్డ కీర్తన

కుప్పంరూరల్ : భార్యను దారుణంగా కత్తితో దాడి చేసిన ఘటన కుప్పం మండలం, బైరప్పకొటాలు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. కుప్పం మండలం, బైరప్పకొటాలు గ్రామానికి చెందిన కీర్తనకు తమిళనాడు రాష్ట్రం వేపనపల్లి సమీపంలోని కెడయంబేడు గ్రామానికి చెందిన రాజేష్‌తో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఆరు నెలల కొడుకు ఉన్నాడు. కీర్తన ప్రసవం కోసం స్వగ్రామం బైరప్పకొటాలు గ్రామానికి వచ్చింది. ఆరు నెలలుగా ఇక్కడే ఉంటోంది. రాజేష్ మాత్రం అప్పుడప్పుడూ వచ్చి వెళ్లేవాడు. దంపతుల మధ్య నెల రోజులుగా విబేధాలు చోటు చేసుకున్నాయి. నిత్యం గొడవలు పడేవారు. ఇదే క్రమంలో బుధవారం గొడవ తీవ్ర స్థాయికి చేరడంతో రాజేష్ కత్తి తీసుకుని కీర్తనపై విచక్షణారహితంగా దాడి చేశాడు. కీర్తనకు నోట్లో గుడ్డ కుక్కడంతో చాలాసేపటి వరకు బయటికి తెలియరాలేదు. ఎట్టకేలకు కీర్తన కేకలు వేయడంతో సమీపంలోని గ్రామస్తులు వచ్చి రాజేష్‌ను పట్టుకునే ప్రయత్నం చేశారు. రాజేష్ తప్పించుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి పైకప్పు పైకి వెళ్లాడు. గ్రామస్తులు రాజేష్‌ను పట్టుకుని విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కీర్తనను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో కీర్తనను పీఈఎస్ కళాశాలకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా కీర్తన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. రాజేష్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్రవిడ వర్సిటీలో.. 'కమ్మ'ని పదోన్నతులు!

- ఉద్యోగాలు, పదోన్నతుల్లో వీసీ సామాజిక వర్గానికి పట్టం
- స్థానికులు, భూములిచ్చిన వారికి ఏదీ న్యాయం?



ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలో పదోన్నతులు, ఇంజినీరింగ్ కళాశాల పేరిట నూతన ఉద్యోగాల్లో వర్సిటీ వీసీ సామాజిక వర్గానికి చెందిన వారికే పెద్దపీఠ వేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసినా ద్రవిడ వర్సిటీకి మాత్రం నూతన రెగ్యులర్ వీసీని నియమించలేదు. దీంతో ఇన్‌చార్జి వీసీగా వర్సిటీ లైబ్రేరియన్ ఆచార్య దొరస్వామి కొనసాగుతున్నారు. వర్సిటీకి నూతనంగా ఇంజినీరింగ్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

అవసరం లేకున్నా!

ద్రావిడ యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బోధించేందుకు బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టారు. ఇంజినీరింగ్ కళాశాలలో లైబ్రరీకి లైబ్రరీ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. వర్సిటీ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగికి లైబ్రరీ అసిస్టెంట్ పోస్టును కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వర్సిటీలో ఇప్పటికే ఏడుగురు లైబ్రరీ అసిస్టెంట్లు రెగ్యులర్ పద్ధతిలో, నలుగురు తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వీరిలో కొందరిని ఇంజినీరింగ్ కళాశాలలో ఉపయోగించుకోవచ్చు. కానీ వీసీ సామాజిక వర్గానికి చెంది, ఆయనకు ఆప్తుడు అయిన అతనికి లైబ్రరీ అసిస్టెంట్‌ను కట్టబెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే ఇంటర్వ్యూను సైతం ముగించేశారు. ఈ పోస్టుకు స్థానికులు కొందరు దరఖాస్తులు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అదేవిధంగా స్థానిక నాయకులు ఈ ఉద్యోగం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదనే చెప్పాలి.

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి!

ఇటీవల వర్సిటీలో సూపరింటెండెంగ్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్ముగం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఖాళీ ఏర్పడిన ఈ పోస్టుకు వీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు గతంలో ఇక్కడ విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఓ ఉన్నతాధికారిని పిలిపించుకుని మరీ సంబంధిత సీనియర్ అసిస్టెంట్‌కు ఎలా పదోన్నతి కల్పించాలని మంతనాలు జరిపినట్టు వర్సిటీలో చర్చసాగుతోంది.

స్థానిక దళిత ఉద్యోగికి అన్యాయం

వర్సిటీలో గతంలో చంద్రశేఖర్ అనే తాత్కాలిక ఉద్యోగికి తన అర్హత మేరకు అటెండర్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించి జీతాన్ని పెంచారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన వీసీ అతనికి డీ-ప్రమోట్ చేసి మళ్లీ అటెండర్‌గా మార్చారు. వీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ ఉద్యోగికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పదవిని కట్టబెట్టినట్టు బాధితుడు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశాడు.

భూములు కోల్పోయిన ఉద్యోగులకు మొండి చేయి

ద్రావిడ వర్సిటీ వెయ్యి ఎకరాలకుపైగా భూములతో విస్తరించి ఉంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ భూములను వర్సిటీకి ధారాదత్తం చేశారు. భూములు కోల్పోయిన వారికి కుటుంబానికి ఒకరికి తాత్కాలిక పద్ధతిలో అటెండర్లు, స్వీపర్లుగా ఉద్యోగాలు కల్పించారు. అయితే గత 20 ఏళ్లుగా వారు తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వహిస్తూ కనీస జీతాలు సైతం నోచుకోక మగ్గిపోతున్నారు. గతంలో ఏడాది కాలానికి జీతాలు అందించినా.. మరళా ఐదు నెలల పాటు జీతాలు అందక వారి పరిస్థితి దారుణంగా మారింది. కొత్తగా ఏజెన్సీని నియమించి జీతాలు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. ద్రవిడ వర్సిటీని ప్రక్షాళన చేస్తామని పదే పదే అధికార పార్టీ నేతలు అంటున్నా ఇక్కడి అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుండడం గమనార్హం.